సంక్షేమం, అభివృద్ధితో అన్ని వర్గాలకూ అండ


పెదవేగి: పెదకడిమిలో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న నాయకులు


పెదపాడు: వట్లూరులో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి

పెదవేగి: సంక్షేమం, అభివృద్ధితో అన్ని వర్గాలకూ అండగా నిలిచామని పెదవేగి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు జానంపేట బాబు అన్నారు. మండలంలోని పెదకడిమిలో గురువారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గన్న జానంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జానంపేట బాబు మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్లలో పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా దేశమంతా ప్రశంసించేలా మన రాష్ట్రం సాధించిన పురోభివద్ధిని అందరికీ క్షుణ్ణంగా తెలియజెప్పేలా, గత సర్కారుకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని చాటి చెప్పేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. ముందుగా సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించే ప్రగతినివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొప్సాక సొసైటీ చైర్మన్ చళ్ళగొళ్ల భూస్వామి, ఎంపీడీఓ జి.రాజీమనోజ్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, మేడికొండ కృష్ణారావు, పర్వతనేని నాగయ్య, చలసాని వెంకటరావు పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: పాఠశాలలు నాడు నేడు ద్వారా మెరుగుపరచడంతో పాటు మెరుగైన వైద్య సాయాన్ని అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి తెలిపారుజ పెదపాడు మండలంలోని వట్లూరు 2 గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహ/ ంచారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. అలాగే ఇంటికి వెళ్లి జగన్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులుతో పాటు వీఆర్వో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుపాను వేగంతో స్పందన


పోలసానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న విద్యుత్, పంచాయతీ సిబ్బంది

భీమడోలు: తుపాను ప్రభావం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పోలసానిపల్లి గ్రామంలోని పలు వార్డులకు రెండు రోజులుగా తాగునీటి సమస్య తలెత్తింది. దీనిపై స్పందించిన సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా గురువారం గ్రామంలోని 10, 11, 12 వార్డులోని ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అనంతరం బీసీ కాలనీలోని పాడైన ట్రాన్స్‌ఫార్మన్‌ను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి, విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీనితో మంచినీటి సమస్యను పరిష్కరించారు. అదే విధంగా గ్రామానికి చెందిన పలు రైతులకు చెందిన ధాన్యం రాసులు తడిచిపోయాయి. దీనితో మొలకెత్తిన గింజలను పరిశీలించిన సర్పంచ్ సమస్యలను ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు దృష్టికి తీసుకుని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వర్షాలు తగ్గుముఖం


సూరప్పగూడెంలో ఏరియాలో ధాన్యాన్ని లారీల్లో మిల్లుకు పంపుతున్న వ్యవసాయ సిబ్బంది

భీమడోలు: వర్షాలు తగ్గుముఖం పట్టడం... మరో వైపు ప్రభుత్వం ధాన్యం సేకరణలో నిబంధనలు సడలించడంతో ధాన్యం రవాణా ఊపందుకుంది. భారీ వర్షాలు వల్ల మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సైతం తడిసింది. దీనితో పాటు మూడు రోజుల పాటు ధాన్యం మిల్లులకు పంపే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతుల కష్టాలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు తమ ధాన్యం తరలించుకునే క్రమంలో ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులకు చెక్ పెట్టారు. నిబంధనలతో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్‌లోను, సమీపంలోని మిల్లులకు ధాన్యాన్ని తరలించడం, జీపీఆర్ఎస్ విధానాన్ని తాత్కాలికంగా స్వస్తి పలుకుతూ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం నుంచి పొడి వాతావరణం ఉండడంతో రైతులు కొంచెం తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. మరి కొందరు తమ ధాన్యాన్ని మిల్లులకు లారీల్లోను, ట్రాక్టర్లలోను తరలించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపారు. ఇదిలా ఉండగా తుఫాన్ ప్రభావంతో మండలంలో నేలవారి తడిసి పోయిన పంట 900 ఏకరాలకు గాను, తడిసిన ధాన్యం 2వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు కోలుకుంటున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి


సూరప్పగూడెంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

భీమడోలు: తుఫాన్ వల్ల వ్యవసాయ క్షేత్రాల్లో పూర్తిగా మునిగిన, తడిసిన పంట దెబ్బతిన్న పంట పొలాల్లో 5 శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేస్తే మేలు జరుగుతుందని ఏలూరు డాట్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ కె.ఫణికుమార్ అన్నారు. సూరప్పగూడెంలో వర్షాలకు తడిసిన, రంగు మారిన ధాన్యం, మొలకెత్తిన వరి రాశులను గురువారం ముగ్గురు సభ్యుల శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. వర్షాలకు నేలపై పడిన పంటను, గింజ మొలకెత్తకుండా రైతులు సంరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచించారు. కోతలు పూర్తయిన వరి పనలను వర్షాల నుంచి రక్షించుకునేందుకు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ చాముండేశ్వరి, నాగేంద్రబాబు, కోఆర్డినేటర్ టి.సుజాత, వీఆర్వో వి.నాగేశ్వరరావు, వీఏఏ సైలా భాను, రైతులు పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: తుపాను కారణంగా ముంపుకు గురైన వరి పొలాలను గురువారం ఏలూరు డాట్ సెంటర్ సైంటిస్టులు పరిశీలించారు. పంట రక్షణకు రైతులకు జాగ్రత్తలను సూచించారు. వారి వెంట వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు, దెందులూరు మండల ఏఓ గద్దె రమేష్ ఉన్నారు.

పంట నష్టం అంచనాల్లో అధికారులు


వెంకటాపురంలో పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్


చాటపర్రులో నీట మునిగిన వరి పనలు

ఏలూరు రూరల్: ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు తుపాను పంట నష్టాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. చేలల్లో ముంపునీటి పారుదలకు చర్యలు చేపట్టారు. తుపాను నష్టంపై ఏలూరు మండల ప్రత్యేక అధికారిణి, ఐసీడీఎస్ పీడీ పద్మని సమక్షంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, రూరల్ తహసీల్దార్ జె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.ప్రణవి, మండల వ్యవసాయ అధికారిని జీవనసంధ్య, రైతు భరోసా కేంద్రం సిబ్బంది సమీక్షించారు. ఈ ఏడాది ఏలూరు అర్బన్ ప్రాంతాలకు చెందిన పోణంగి, కొమడవోలు, శనివారపుపేట, వెంకటాపురం, సత్రంపాడు, చొదిమెళ్ళ, తంగెళ్లమూడి ప్రాంతాల్లో 3122.4 ఎకరాల్లో వరిసాగు చేయగా, ఇందులో 296 ఎకరాల్లో పంట నీట మునిగిందని, 824.06 ఎకరాల్లో పంట నేల కొరిగిందని గుర్తించారు. తుపానుకు ముందు 168.05 ఎకరాల్లో పంటను మాత్రమే మిల్లులకు తరలించినట్టు పేర్కొన్నారు. ఏలూరు రూరల్ గ్రామాలైన మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, బూబూఖాన్‌గూడెం, తిమ్మారావుగూడెం, మల్కాపురంలో 3658.74 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో 701 ఎకరాల్లో పంట నేలకొరగా, మరో 520 ఎకరాల్లో పంట నీట మునిగినట్టు గుర్తించారు. ఇందులో అత్యధికంగా పంట పనలపై ఉందని, ఇప్పటి వరకు 462 ఎకరాల్లో మాత్రమే పంట ఒబ్బిడయినట్టు నిర్ధారించారు. చాటపర్రులో నాలుగెకరాల్లో పంట నీటి మునిగినట్టు పేర్కొన్నారు. వెంకటాపురం సుంరక వారితోట రైతు తలారి కొండబాబు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ బి.సోమశేఖర్ కాలువకు అడ్డంకులు తొలిగింపజేశారు. చేపల చెరువుల గట్లు కారణంగా చాటపర్రు, జాలిపూడి పరిసరాల్లో పంట చేలల్లో మురుగునీరు కింద పారడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్జీనియా తోటల్లో ఇసుక మేటలు


కొయ్యలగూడెం: మంగపతిదేవిపాలెం వద్ద వర్జీనియా తోటలలో వేసిన ఇసుక మేటలు

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావం రైతులపై తీవ్ర ప్రభావం చూపించింది. ముఖ్యంగా వర్జీనియా పొగాకు తోటలకు భారీ నష్టాన్ని మిగిల్చింది. పొగాకు తోటలలో వరద ప్రవహించడం వల్ల ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.75 వేల నుంచి లక్ష పెట్టుబడి పెట్టామని, వర్షంతో వచ్చిన వరదల వల్ల చేలలోని ఇసుక మేటలను తొలగించడానికి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని రైతు ఊసా దామోదరం వాపోయాడు. మళ్లీ తోటలు వేసినా అదును ప్రభావం దాటిపోతుందని, దీంతో నాణ్యమైన పొగాకు దిగుబడి సాధ్యం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజవరం పంచాయతీ పరిధిలో అదేవిధంగా కన్నాపురం, దిప్పకాయలపాడు పంచాయతీల్లోని పొగాకు తోటలలో ఇసుక మేటలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని వారు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

బుట్టాయగూడెం: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఏజెన్సీ మెట్టప్రాంతాల్లోని వర్జీనియా పొగాకు, వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వర్షానికి పొగాకు, మినుము, వేరుశనగ పంటల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరింది. ఈదురు గాలులు కూడా భారీగా వీయడంతో పలుచోట్ల పొగాకు, వేరుశనగ పంటలపై వరదనీరు ముంచెత్తడంతో ఇసుక మేట్లు వేశాయి. రైతులు ఇసుక మేట్లతో ఉన్న పంటలను చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాగా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో సుమారు 1137 ఎకరాల్లో మొక్కజొన్న, 2064 ఎకరాల్లో పొగాకు, 1515 ఎకరాల్లో ప్రత్తి, 76 ఎకరాల్లో మినుము, 413 ఎకరాల్లో వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులు పంపిస్తామని చెబుతున్నారు.

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం


మొయ్యేరులో నీట మునిగిన వరి దుబ్బలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు అండగా ఉంటామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని కొనుగోలు కేంద్రాలకు ఆదేశాలిచ్చామని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఆయన తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాలలో పంట నష్టపోయిన రెతులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ధాన్యం రంగుమారినా, నాణ్యత తగ్గినా రైతులకు నష్టం లేకుండా ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల కారణంగా నష్టనివారణ తగ్గించగలిగామన్నారు. సార్వా పంట చేతికందే సమయంలో తుపాను కారణంగా భారీ వర్షాలు కురవడం దురదృష్టకరమని, ఈవిషయంలో ప్రభుత్వం రైతులకు పూర్తి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కొందేపాడు గ్రామాల్లో దెబ్బతిన్న సార్వా పంటను పరిశీలించారు. ట్రాక్టర్‌పై వెళ్లి యనమదుర్రు మురుగు కాల్వ పరీవాహక ప్రాంతంలో పొలాలను పరిశీలించారు. ఈయన వెంట ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి, దుక్క కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యులు పిల్లి సంతోషం, వ్యవసాయ అధికారులు పి.మురళీకృష్ణ, యర్రంశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు


సమావేశంలో మాట్లాడుతున ఎంపీడీఓ రాజీమనోజ్

పెదవేగి: మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన ఏ ఒక్క రైతు అధైర్యపడాల్సిన అవసరం లేదని పెదవేగి ఎంపీడీఓ జి.రాజీమనోజ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన వ్యవసాయ సహాయకుల సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ తుపాను వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను నిష్పక్షపాతంగా పరిశీలించి అందరి వివరాలను సేకరించి ఉన్నతాధిరులకు నివేదించాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఆదుకోవటానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నష్టం అంచనాల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ప్రియాంక పాల్గొన్నారు.

టీ సెంటర్‌లు సీజ్


బల్లరేవు టీసెంటర్లు సీజ్ చేస్తున్న దృశ్యం

పెదపాడు: మండలంలోని బళ్లరేవు తూము సెంటర్‌లోని టీసెంటర్లు సీజ్ చేసినట్లు పెదపాడు పంచాయతీ కార్యదర్శి దాకారపు వినోద్‌కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు పెదపాడు గ్రామంలో డస్ట్‌బిన్స్ నిర్వహణ సరిగాలేని షాపులను సీజ్ చేశామన్నారు. యజమానుల నుంచి రాతపూర్వక సంజాయిషీ పత్రాన్ని తీసుకుంటామని పేర్కొన్నారు.

మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండాలి


బ్రాహ్మణ చెరువు వద్ద మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

పెదపాడు: మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు గ్రామంలోని బ్రాహ్మణ చెరువు వద్ద ఉన్న మంచినీటి ట్యాంకు పైకి ఎక్కి ట్యాంకులో నీటిని ఎంపీడీఓ సూర్యకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పీఎస్ఆర్‌వీఎస్ఎస్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ నిబంధనల మేరకు ప్రతి 15 రోజులకోసారి ట్యాంకును పరిశుభ్రం చేయాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ప్రజలకు అందించాలన్నారు. పరిశుభ్రమైన నీరు ప్రజలుకు అందించడం వల్ల ప్రజలు ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు పంచాయతీ కార్యదర్శి దాకారపు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో రోడ్ల నిర్మాణం


16వ డివిజన్‌లో రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ విజయనిర్మల, నాయకులు రమేష్

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్లల్లో ప్రజల నుంచి, పార్టీ నేతల వినతుల మేరకు రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, వీధిదీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వన్‌టౌన్ 16వ డివిజన్‌లో 43వ సచివాలయం పరిధిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే మూడు రోడ్లు నిర్మించగా, గురువారం మరో సీసీ రోడ్డు నిర్మించారు. పడమరవీధి చేపల చెట్టు రోడ్డు, చాకలిదిబ్బ రోడ్డు, గంగానమ్మ స్కూల్ ఎదురు రోడ్డు కొత్తగా నిర్మించారు. కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల పార్టీ యువజన నాయకులు జిజ్జువరపు రమేష్ పర్యవేక్షణలో రోడ్డు నిర్మించారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం చేయడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పీఎం విశ్వకర్మ యోజనపై విస్తృత ప్రచారం

ఏలూరు (టూటౌన్): పీఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ కోరారు. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ ఏలూరు జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న జంగారెడ్డిగూడెంలో నిర్వహించే బూత్ స్వశక్తీకరణ సమావేశంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి జిల్లా పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

నేడు రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

దెందులూరు: గోపన్నపాలెం ఆర్‌బీకే ఎదుట నూతనంగా నిర్మించనున్న రామాలయానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుక్రవారం ఉదయం 9:56 నిమిషాలకు శంకుస్థాపన చేస్తారని సర్పంచ్ పోటే నాగమల్లేశ్వరి కుమార్ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పూజలు నిర్వహిస్తారని కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సర్పంచ్ కోరారు.

విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లోని విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పలు డివిజన్లల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. 33, 37, 38 డివిజన్లకు సంబంధించి 29, 30 సచివాలయాల పరిధిలో జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమం డిప్యూటీ మేయర్లు శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యురాలు తాయారు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను బోర్డును ప్రారంభించారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉన్నత విద్య, నాణ్యమైన వైద్య సేవలను, చికిత్సలను అందుబాటులోకి తెచ్చారని వివరించారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలు తీసుకున్నారని విమర్శించారు. పేదలకు ఇంగ్లిష్ విద్యతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

క్లుప్తంగా

కూలిన ఇంటి పరిశీలన


పోతునూరులో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్

దెందులూరు: మిచాంగ్ తుపాను కారణంగా పోతునూరు గ్రామంలో పమ్మి సోమాలమ్మ ఇల్లు కూలింది. గురువారం సర్పంచ్ బోదుల స్వరూప్ సోమాలమ్మను పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకుని, గృహ అవసరాలను అందజేశారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి విషయాన్ని తెలిపి ప్రభుత్వం పరంగా సాయం అందించేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చురుగ్గా విద్యుత్ పునరుద్ధరణ పనులు


ఉంగుటూరులో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఉంగుటూరు (నిడమర్రు): తుపాను ప్రభావంతో ఉంగుటూరు మండలంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు పనులు ఏడీఏ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు చురుగ్గా చేస్తున్నారు. ఉంగుటూరు గ్రామంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టారు. 24 గంటల్లో మండలంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా అందించినట్లు ఏఈ శ్రీరామ్ తెలిపారు. ఈ పనుల్లో లైన్మెన్ నాగరాజు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


పిప్పరలో దండుసూరిబాబును పరామర్శిస్తున్న వాసుబాబు

గణపవరం: ఇటీవల అనారోగ్యానికి గురైన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి దండు సూరిబాబును గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల సూరిబాబు గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈయన వెంట మండల పార్టీ కన్వీనర్ దండు రాము తదితరులు ఉన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు


గణపవరంలో విద్యార్థినులకు ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: రక్తహీనత కారణంగా అనేక ఆరోగ్యసమస్యలు వస్తాయని, ముఖ్యంగా విద్యార్థులు చదువులో వెనుకబడిపోతారని గణపవరం పిహెచ్‌సీ సిహెచ్‌వో జె.విల్సన్ అన్నారు. గురువారం గణపవరం బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. రక్తహీనత లేకుండా ఆకుపచ్చని ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ఐరన్‌మాత్రలు మింగించారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

దెందులూరు: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్, జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు రమేష్ మాట్లాడుతూ రోజు వారి శరీరంలో కలిగే అనేక నొప్పులను మందుల అవసరాలు లేకుండా వివిధ వ్యాయామాల ద్వారా నివారించుకోవచ్చన్నారు. హెచ్‌ఎం పీవీ రామశర్మ, ఎంఈఓ ఏపీఎస్‌వీ ప్రసాద్ పలు సూచనలు చేశారు.

ఉన్నతి పథకంలో మహిళలకు ఆటోలు

దెందులూరు: ఉన్నతి పథకం మహిళా శక్తి ఆటో రిక్షా కింద వైఎస్సార్ క్రాంతి పథకం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆటో డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ ఉన్న ఎస్టీ, ఎస్సీ మహిళలకు 3,32,718 యూనిట్ కాస్ట్‌తో వడ్డీ లేని రుణం 3 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని దెందులూరు ఏపీఎం వేణుగోపాల్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ మహిళల జీవనోపాధికి తోడ్పాటు నిమిత్తం ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తుందని, అర్హత కలిగిన మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.